క్లుప్తంగా

పారిశుద్ధ్య పనుల నిర్వహణ



నున్న(విజయవాడరూరల్): గ్రామాల్లో వైద్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం డ్రైడే పాటించారు. సేకరించిన చెత్తను ఎప్పటికప్పుడు డంప్ చేయాలని, డ్రెయినేజీ కాల్వల్లో మురుగు నీరు నిల్వ ఉండ కుండా చూడాలని కోరారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులతో పనులు చేయించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రోజుల తరబడి వాడుక నీరు తొట్టెల్లో నిల్వచేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తినే ఆహారపదార్థాలపై ఈగలు, దోమలు వాలకుండా చూడాలని ప్రజలకు అవగాహన కల్పించారు. నున్న గ్రామంలో 1, 2, 3 సచివాలయాల పరిధిలో ఏఎన్ఎంలు, రజని, లక్ష్మీ, శ్రీదేవి, పాతపాడు గ్రామంలో నవత, పి.నైనవరం గ్రామంలో మురళీకృష్ణ, అంబాపురం గ్రామంలో భూలక్ష్మి పర్యటించి ప్రజలకు సూచనలు, సలహాలు ఇచ్చారు.

ఎమ్మార్పీఎస్ జెండా దిమ్మ నిర్మాణానికి శంకుస్థాపన



గన్నవరం రూరల్: మండలంలోని సూరంపల్లి గ్రామంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ జెండా దిమ్మ నిర్మాణానికి జాతీయ ఉపాధ్యక్షుడు జె.నరసింగరావు శంకుస్థాపన చేశారు. జూలై 7న ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని గ్రామగ్రామాన నిర్వహించి జెండాలు ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ అన్ని సామాజిక వర్గాలను కలుపుకుని ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. మాజీ సర్పంచ్ దేవరపల్లి కోటేశ్వరరావు, నియోజకవర్గ బాధ్యులు మందా వేణు, జిల్లా అధికార ప్రతినిధి కోట కృష్ణమోహన్, గ్రామ అధ్యక్షుడు దేవరపల్లి సురేష్, మహేష్, బాబూరావు, మరియదాసు, చత్రపతి, సురేష్, మరియదాస్, రవీంద్రనాథ్, చంటి, కిషోర్, అంబేడ్కర్, ధోనేశ్వరి పాల్గొన్నారు.

గురుకులంలో ఖాళీ సీట్ల భర్తీకి చర్యలు

ప్రిన్సిపాల్ యశోదలక్ష్మి



గన్నవరం రూరల్: మండలంలో వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వై.యశోదలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి, జూనియర్ ఇంటర్‌లలో మిగిలిన సీట్లు భర్తీ కోసం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 9వ తరగతిలో మిగిలిన సీట్ల భర్తీ కోసం పరీక్ష నిర్వహిస్తారని చెప్పారు. 5వ తరగతిలో ప్రవేశానికి కౌన్సెలింగ్ ఈ నెల 22న కుంటముక్కల (మైలవరం), 6, 9 తరగతుల వారికి 25న కుంటముక్కలలో పరీక్ష నిర్వహిస్తారన్నారు. ఉదయం 9గంటలకు పరీక్ష ప్రారంభం అవుతుందని పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టిక్కెట్, ఫొటో, ఆధార్ జిరాక్స్ తెచ్చుకోవాలన్నారు. 6వ తరగతిలో బీసీ–సీ మూడు సీట్లు ఖాళీగా ఉన్నాయని, 9వ తరగతిలో బీసీ–సీ మూడు, ఓసీ–1 ఖాళీ ఉన్నాయన్నారు. జూనియర్ ఇంటర్ బైపీసీ, ఎంపీసీ తరగతులకు కౌన్సెలింగ్ 26న కుంటముక్కలలో జరుగుతుంది. విద్యార్థులు సర్టిఫికెట్లతో రావాలన్నారు. 5, ఇంటర్మీడియెట్‌లో మిగిలిన సీట్లకు ఎంట్రన్స్ టెస్ట్ రాసిన వారు, రాయని వారు కూడా అర్హులేనని వివరించారు. వివరాలకు వీరపనేనిగూడెం గురుకుల పాఠశాలలో సంప్రదించాలన్నారు.

పరాయి పంచన

వ్యవసాయ శాఖకు సొంత గూడు కరువు

- శిథిలావస్థకు చేరిన సొంత భవనం
- అదే దారిలో రైతు సేవా కేంద్రం
- వసతులు లేక అవస్థలు పడుతున్న వ్యవసాయశాఖ సిబ్బంది
- సొంత భవనం ఎప్పటికి సమకూరెనో?



మండల వ్యవసాయశాఖ కార్యాలయం



శిథిలావస్థకు చేరిన రైతు సేవా కేంద్రం

కంకిపాడు: వ్యవసాయశాఖకు సొంత గూడు లేదు. ప్రస్తుతం ఉన్న భవనం శిథిలావస్థకు చేరువైంది. వసతులు లేవు. ఇబ్బందులు పడుతూ సిబ్బంది విధులు నిర్వహిస్తున్న దుస్థితి. దీంతో పాటు రైతు సేవా కేంద్రం కూడా అధ్వానంగా మారింది. రైతు సేవలకు దూరంగా మగ్గుతోంది.

ప్రాధాన్యత ఇదీ..

వ్యవసాయపరంగా పెనమలూరు నియోజకవర్గంలో కంకిపాడుకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. 20 గ్రామ పంచాయతీల పరిధిలో 22 వేల ఎకరాల్లో సాగు భూములు ఉన్నాయి. ప్రధానంగా వరితో పాటుగా చెరకు, పసుపు, కూరగాయలు, తమలపాకు, కంద, ఇతర వాణిజ్య పంటలను రైతులు సాగు చేస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న వ్యవసాయశాఖకు సొంత గూడు లేదు.

ఇరుకు గదిలో ఉండలేక..

కార్యాలయం నిర్వహిస్తున్న భవనం చిన్నది కావటంతో సరైన వసతులు లేవు. కేవలం ఒక్క గది మాత్రమే ఉంది. ఆ గదిలోనే విధులు కొనసాగించాల్సిన దుస్థితి. దీనికి తోడు భవనం నిర్మించి ఏళ్లు గడిచిపోవటంతో శిథిలావస్థకు చేరువ అయ్యింది. గోడలు పగుళ్లువారుతున్నాయి. అడపాదడపా విష కీటకాలు ప్రవేశిస్తుండటంతో సిబ్బంది భయం భయంగా విధులు నిర్వహించారు. ఇటీవల కాలంలో కార్యాలయ విధులను మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఉన్న అగ్రిల్యాబ్ నుంచి నిర్వహిస్తున్నారంటే సమస్య తీవ్రత అర్థం చేసుకోవచ్చు.

మార్కెట్ యార్డులోని భవనంలో..

ఏళ్ల తరబడి పట్టణంలోని మార్కెట్‌యార్డులోని ఓ భవనంలో వ్యవసాయశాఖ కార్యాలయం నడుస్తోంది. ఈ భవనం నుంచే వ్యవసాయాధికారితో పాటుగా మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో వీఏఏలు విధులు నిర్వహిస్తూ మండల స్థాయి సమీక్షలకు హాజరవుతూ ఉంటారు. గతంలో వ్యవసాయ సలహా మండలి సమీక్షా సమావేశాలు కూడా ఇక్కడే జరిపేవారు. వ్యవసాయశాఖతో పాటుగా ఇదే కార్యాలయం నుంచి ఉద్యానశాఖ అధికారి కూడా విధులు నిర్వహిస్తుండేవారు.

రైతు సేవలకు దూరంగా..

ఇదే ప్రాంగణంలో గతంలో మార్కెట్‌యార్డు కార్యాలయం నిర్వహించిన పాత భవనంలో ఓ వైపు గదులను రైతు సేవా కేంద్రానికి కేటాయించారు. ప్రస్తుతం ఆ ప్రాంతం అంతా పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. భవనం పగుళ్లువారి ఎప్పుడు కూలిపోతుందోనన్న భయం నెలకొంది. దీంతో రైతు సేవా కేంద్రం రైతు సేవకు దూరంగా ఉంటోంది. కనీస మరమ్మతులు నిర్వహించినా ఉపయోగపడని పరిస్థితి.

సొంత భవనం కోసం ఎదురు చూపులు..

వ్యవసాయశాఖ సొంత భవనం కోసం ఎదురు చూస్తోంది. దశాబ్దం క్రితం వ్యవసాయశాఖకు సొంత భవనం నిర్మించే ప్రతిపాదనలో చెరువు కట్ట సమీపంలోని మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం వెంబడి ఉన్న కొంత స్థలాన్ని కేటాయించారు. పునాదుల వరకూ భవనాన్ని నిర్మించారు. తదుపరి నిధులు లేమి సమస్యతో భవన నిర్మాణం ముందుకు సాగలేదు. ప్రస్తుతం ఈ ప్రాంగణంలోకి గృహ నిర్మాణశాఖ, తాజాగా రెయిన్ ఫాల్ యూనిట్ అందుబాటులోకి వచ్చాయి. మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖలూ ఒకే గొడుగు కిందకు తెచ్చే యోచనతో మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో స్థలం కేటాయిస్తే వ్యవసాయశాఖకు సొంత భవనం నిర్మించుకునేందుకు మార్గం సుగమం అవుతుంది. దీని వల్ల ప్రజలకు అన్ని శాఖల కార్యకలాపాలు ఒకే ప్రాంగణంలో లభ్యమవుతాయి. లేనిపక్షంలో మార్కెట్‌యార్డు ప్రాంగణమే దిక్కు అవుతుంది.

ప్రాధాన్యతాక్రమంలో రోడ్ల అభివృద్ధి



కంకిపాడు: ప్రాధాన్యతా క్రమంలో రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు ఏఎంసీ చైర్మన్ అన్నే ధనరామకోటేశ్వరరావు (ధనయ్య) అన్నారు. గ్రామ పంచాయతీ నిధులు రూ.4.80 లక్షల అంచనా వ్యయంతో ఉప్పలూరు గ్రామంలో చేపట్టిన తారురోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిధులు సద్వినియోగం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. రహదారి నిర్మాణ పనుల్లో లోటుపాట్లు తలెత్తకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. సర్పంచ్ లాం సోనియా, ఎంపీటీసీ లాం పార్వతి, ఈఓ బి.వెంకటేశ్వరరావు, చలసాని రాధాకృష్ణ, లాం సురేష్, లాం ఏసుపాదం, కలపాల రాజేష్, లాం బోస్, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పెనమలూరు: నియోజకవర్గంలో అనారోగ్యంతో ఉన్న బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. పోరంకి ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ చెక్కులను అందజేశారు. 30 మందికి రూ.18 లక్షలు విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఇచ్చారు. టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకర్ బాబు, కోయా ఆనంద్, దోనేపూడి రవికిరణ్, సంగెపు రంగారావు, రామ్‌కుమార్ పాల్గొన్నారు.

అనుమతి గోరంత.. తవ్వకం కొండంత

ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు



నున్న బూరుగుల చెరువులో మట్టి తవ్వుతున్న ప్రొక్లెయిన్, పక్కన ట్రాక్టర్లు

విజయవాడరూరల్: నున్న గ్రామంలో టీడీపీ నాయకులు ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు చేస్తున్నారు. 21 సెంట్ల వ్యవసాయ భూమిని మెరక చేసుకొనేందుకు అనుమతి తీసుకొని రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా నున్న, పాయకాపురం, కండ్రిక పరిసర ప్రాంతాల్లోని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు మట్టిని విక్రయిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ మట్టిని రూ.200 వంతున టోకెన్ల విక్రయిస్తున్నారు. ట్రాక్టర్ల యజమానులు ప్రజలకు ట్రాక్టర్ మట్టిని రూ.1000 చొప్పున విక్రయిస్తున్నారు.

21 సెంట్ల వ్యవసాయ భూమి మెరకకోసమని..

నున్న గ్రామానికి చెందిన కిరణ్ అనే వ్యక్తి తన కున్న 21 సెంట్లలో వ్యవసాయ భూమిని మెరక చేసుకొనేందుకు పర్మిషన్ తీసుకున్నాడని ఇరిగేషన్ అసిస్టెంటు ఇంజినీరు బి.రాజశేఖర్, మండల తహసీల్దారు బి.సుగుణ తెలిపారు. అది కూడా నున్న బూరుగుల చెరువులో మీటరు కంటే ఎక్కువ లోతు మట్టిని తీయకూడదనే నిబంధన ఉందని ఏఈ తెలియజేశారు. అయితే వాళ్లా చట్టాన్ని అతిక్రమించి చెరువు ఆయకట్టు వ్యవసాయ భూములకు చెరువు నుంచి నేరుగా సాగు నీరు సరఫరా కాని విధంగా లోతు పెట్టి మరీ మట్టి తవ్వకాలు చేస్తున్నారని గ్రామంలోని రైతులు విమర్శిస్తున్నారు. చెరువు ఇప్పటికే లోతు ఎక్కువగా ఉందని, ఇంకా లోతు చేయడం వలన చెరువు ఆయకట్టు భూములకు సాగునీరు నేరుగా అందదని రైతులు అంటున్నారు. మట్టి ఇష్టం వచ్చినట్లు తవ్వుతున్నా రెవెన్యూ అధికారులు, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడానికి కారణం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ట్రాక్టర్ ట్రక్కు వెనుక డోర్ తీసు మట్టి రావాణా చేస్తుండటంతో మట్టి ముద్దలు రోడ్లపై పడుతున్నాయి. దీనిపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ఈ విషయమై మండల తహసీల్దార్ బి.సుగుణను వివరణ కోరగా నిబంధనల ప్రకారం చెరువులో మట్టి తవ్వకాలు జరగాలని, లేనిచో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

టీడీపీ నాయకుల మధ్య గొడవ

మట్టి తవ్వకాల విషయంలో గ్రామంలోని రెండు వర్గాలకు చెందిన టీడీపీ నాయకులు గొడవ పడుతున్నారు. పార్టీలో కొంత మంది మాత్రమే మట్టిని తవ్వుకొని సొమ్ము చేసుకొంటున్నారని, రోడ్డు నిర్మాణ పనులు కూడా అదే వ్యక్తులు చేసుకొంటున్నారని పోలారెడ్డి కేశవరెడ్డి అనే సీనియర్ నాయకుడు గ్రామ ఉపాధ్యక్షుడిపై గొడవ పడ్డారు. ఇద్దరు మధ్య గొడవ జరిగింది. పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో గొడవ సద్దుమణిగింది. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.

నేడు యోగా దినోత్సవం



గన్నవరం క్రీడా ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

పెనమలూరు: ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగా దినోత్సవం కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహిస్తున్నామని కమిషనర్ పి.భవానిప్రసాద్ అన్నారు. ఆయన శుక్రవారం వివరాలు తెలుపుతూ శనివారం ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ప్రాంగణంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్యే బోడెప్రసాద్ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. మున్సిపాలిటీ ప్రజలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 19 వార్డు సచివాలయాలలో కూడా యోగాంధ్ర కార్యక్రమం ఆయా సచివాలయాల పరిధిలో జరుతుందన్నారు. స్థానిక ప్రజలు పాల్గొనాలని కమిషనర్ భవానిప్రసాద్ సూచించారు.

గన్నవరం: స్థానిక జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో జరగనున్న అంతర్జాతీయ యోగా కార్యక్రమం ఏర్పాట్లను శుక్రవారం అధికారులు పరిశీలించారు. ఎంపీడీఓ టి.స్వర్ణలత, గుడివాడ డీవైడీఈవో కొండా రవికుమార్, ఎంఈఓ– 2 ఎం.కమల, హెచ్ఎం సునీల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎండీడీఓ మాట్లాడుతూ.. శనివారం ఉదయం జరగనున్న యోగా దినోత్సవంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, వాకర్స్, గ్రామ ప్రజలు కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవరావు, పీఈటీలు డి.నాగరాజు, ఎస్‌కే మీరాసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సేవలను సద్వినియోగం చేసుకోండి



తహసీల్దార్ భావనారాయణను సత్కరిస్తున్న మాజీ ఎంపీపీ రాజా, హరికృష్ణ తదితరులు

కంకిపాడు: రెవెన్యూ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వీ భావనారాయణ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భావనారాయణ మాట్లాడుతూ 1786లో రెవెన్యూ వ్యవస్థ ఏర్పాటైందన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రెవెన్యూ దినోత్సవం జరుగుతుందన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ మెరుగైన సేవలు అందించటంలో రెవెన్యూ శాఖ ముందంజలో ఉంటుందన్నారు. మాజీ ఎంపీపీ దేవినేని రాజా, దస్తావేజు లేఖర్ల వృత్తిదారుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మలపల్లి హరికృష్ణ మాట్లాడుతూ సేవలు పారదర్శకంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో గొడవర్రు మాజీ సర్పంచ్ కోనేరు భానుప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ తహసీల్దార్‌గా భావనారాయణ

రెవెన్యూ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ తహసీల్దార్‌గా కంకిపాడు తహసీల్దార్ భావనారాయణ ఎంపికయ్యారు. ఈ మేరకు మచిలీపట్నంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టరు డీకే బాలాజీ చేతులమీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా కంకిపాడులో తహసీల్దార్‌ను ఘనంగా సత్కరించి అభినందించారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక మహాత్మగాంధీ నగర్‌లోని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో రెవెన్యూ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బాపులపాడు తహసీల్దార్ బి.మురళీకృష్ణ, డెప్యూటీ తహసీల్దార్ రాజేంద్ర, ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జేవీవీ సత్యనారాయణ, రిటైర్డ్ తహసీల్దార్ బి.కోటేశ్వరరావు, రిటైర్డ్ డీటీ ఎ.మోహనరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఉత్తమ సేవలు అందించిన రెవెన్యూ అధికారులను పురస్కారాలతో సత్కరించారు. ఆర్ఐ ఆర్‌వీవీ సుబ్రహ్మణ్యం, వీరవల్లి వీఆర్వో అట్లూరి సునీల్, కాకులపాడు గ్రామ సర్వేయర్ జె.మౌనిక, వీరవల్లి వీఆర్ఏ గోపిలకు ఉత్తమ సేవ పురస్కారాలను అందించారు.

ఆలయంలో యోగా పోటీలు



పెనమలూరు: యనమలకుదురు శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో శుక్రవారం యోగా పోటీలు నిర్వహించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి కృష్ణా జిల్లా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా పోటీలు నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. యోగా టీచర్లను సన్మానించారు. ముప్పవరపు రోహిత్‌కుమార్ యోగాలో పాల్గొన్న వారికి మజ్జిగ పంపిణీ చేశారు. ఆలయ నిర్మాణ దాత సంగా నరసింహారావు, ప్రధాన పూజారి జీఆర్‌వీ సాగర్, ఈవో ఎస్.భవాని పాల్గొని ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన భక్తులు శుక్రవారం రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. విజయవాడ గుణదలకు చెందిన టి.లలితానంద్ కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ. 1,01,116 విరాళాన్ని అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించగా, ఆలయ ఈవో శీనా నాయక్ దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.

పన్ను చెల్లింపులకు నెలాఖరు వరకే గడువు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర ప్రజలు వీఎంసీకి చెల్లించే వివిధ పన్నులు వడ్డీ పడకుండా చెల్లించేందుకు ఈ నెల 30వ తేదీనే ఆఖరు గడువని వీఎంసీ డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి. సృజన శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలందరూ తమ ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను, డ్రెయినేజ్ పన్ను, నీటి పన్ను సకాలంలో చెల్లించవలసిందిగా ఆమె సూచించారు. పన్నులు చెల్లించని వారికి జూలై ఒకటో తేదీ నుంచి వడ్డీ పడుతుందని, నగర ప్రజలందరూ వడ్డీ పడకుండా, సకాలంలో పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలని ఆమె సూచించారు.

నాణ్యమైన విద్యతోనే బాలికల ప్రగతి



వణుకూరులో ప్రసంగిస్తున్న సులోచనారాణి

పెనమలూరు: బాలికలు నాణ్యమైన విద్యను అభ్యసించి, నైపుణ్యం సాధించటంతోనే ప్రగతి చెందుతారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎల్.సులోచనారాణి అన్నారు. వణుకూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కిశోర వికాసం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలికలకు సమాజంలో గుర్తింపు రావాలంటే ఉన్నతంగా చదవాలని సూచించారు. నేపుణ్యాలు సాధించటంతో ఉపాధి అవకాశాలు కలిగి ఆర్థికంగా ఎదుగుతారని వివరించారు. బాలికలు వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలని, మంచి ఆహారం తీసుకొని ఆరోగ్యంగా జీవించాలని అన్నారు. బాల్య వివాహాలు, అక్రమ రవాణాలపై అవగాహన ఉండి వ్యక్తిగతంగా ఆత్మరక్షణ పొందాలని సూచించారు. లైంగిక వేధింపులు జరిగితే వెంటనే తల్లితండ్రులకు, పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.రఘురామ్ మాట్లాడుతూ శ్రద్ధతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని అన్నారు. చదువు భవిష్యత్తుకు మార్గం చూపుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి డి.వికల్ప, వెల్ఫేర్ అసిస్టెంట్ డి.సునీత, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



కంకిపాడు: బాల్య వివాహాలను అరికట్టాలని ఐసీడీఎస్ కంకిపాడు సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్.అన్నామణి అన్నారు. కౌమార బాలికలకు బాల్య వివాహ చట్టాల గురించి కంకిపాడు జెడ్పీ పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో మానవహారంగా ఏర్పడి చట్టాలపై అవగాహన కలిగిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అన్నామణి మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. యుక్తవయస్సులో జరిగే శారీరక మార్పులు, మంచి చెడు గురించి తెలుసుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాలకు బానిసలు కావొద్దని సూచించారు. స్వీయ రక్షణ చర్యలపై పట్టు సాధించాలని, ఆరోగ్యంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం డి.ఉమాదేవి, మహిళా సంరక్షణ కార్యదర్శి జి.రమ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసరపల్లి పేదల లేఅవుట్‌కు రోడ్డు నిర్మాణం



ఏలూరు కాలువపై నిర్మిస్తున్న బీటీ రోడ్డు

కేసరపల్లి(గన్నవరం): మండలంలోనే అత్యధిక మంది పేదలకు నివేశన స్థలాలు కేటాయించిన కేసరపల్లి లేఅవుట్‌కు (జగనన్న కాలనీకి) మార్గం సుగమమైంది. ఏలూరు కాలువ గట్టుపై ఇరిగేషన్ శాఖకు చెందిన స్థలంలో గన్నవరం- కంకిపాడు ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి లేఅవుట్ వరకు రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఎంజీ ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.2 కోట్లతో సుమారు 1,280 మీటర్ల పొడవున పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో రోడ్డు నిర్మాణం జరుగుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇక్కడ లేఅవుట్‌లో సుమారు 3,450 మంది పేదలకు నివేశన స్థలాలు కేటాయించారు. అప్పట్లో కేసరపల్లి శివారు అప్పారావుపేట మీదుగా లేఅవుట్‌లోకి వెళ్లే విధంగా ఏలూరు కాలువపై వంతెన నిర్మాణానికి సన్నహాలు జరిగాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మాత్రం లేఅవుట్‌కు దగ్గర మార్గమైన వంతెన నిర్మాణాన్ని ఆటకెక్కించింది. ప్రత్యామ్నాయంగా ఏలూరు కాలువ గట్టుపై సుమారు ఏడు మీటర్ల వెడల్పున రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. ప్రస్తుతం కాలువ గట్టుపై రెండు అడుగుల మేర రోడ్డును బలోపేతం చేసి బీటీ రోడ్డు నిర్మాణానికి సిద్ధం చేశారు. అయితే ఏలూరు కాలువకు రిటైనింగ్ వాల్ నిర్మాణం చేయకుండా నిర్మిస్తున్న బీటీ రోడ్డు పటిష్టతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సుమారు 20 అడుగుల ఎత్తులో కొత్తగా నిర్మిస్తున్న రోడ్డుకు ఇరువైపులా రైయిలింగ్ నిర్మాణం చేయకపోతే ప్రమాదాలు జరగొచ్చన్నారు. పీఆర్ ఇంజినీరింగ్ అధికారులు మాత్రం రోడ్డు భద్రతపై భరోసా వ్యక్తం చేస్తున్నారు. నీటి ఉరవడికి కోతకు గురికాకుండా ప్రస్తుత గట్టును రెండు అడుగుల మేర ఎత్తు పెంచినట్లుగా చెబుతున్నారు. భారీ వాహనాలు రాకపోకలు సాగించకుండా రోడ్డు ప్రారంభంలో గడ్డర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ట్రాక్టర్లు, లైట్ మోటర్ వాహనాలను మాత్రమే అనుమతించనున్నట్లు పేర్కొన్నారు. బడ్జెట్ ఆధారంగా రోడ్డుపై కనీసం ఏలూరు కాలువ వైపునైనా రైయిలింగ్ నిర్మాణం చేసేందుకు పరిశీలన చేస్తున్నామని పీఆర్ ఏఈ దాసు తెలిపారు.

కాల్వలో గుర్రపుడెక్క తొలగించండి



అంబాపురం వద్ద కాల్వలో గుర్రపుడెక్క

విజయవాడరూరల్: గొల్లపూడి పంట కాల్వలో దట్టంగా పెరిగిన గుర్రపుడెక్క తొలగింపు చర్యలు చేపట్టాలని రైతులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ పనులు ప్రారంభమైనప్పటికీ సాగు నీరు పారుదల కావాల్సిన గొల్లపూడి పంట కాల్వలో కనీసం గుర్రపుడెక్కను తొలగించలేదని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పాములకాల్వ వద్ద కాల్వకు పడిన గండ్లను పూడ్చకపోవడంతో కాల్వలో సాగు నీరు వస్తే సగం నీరు బుడమేరులోకి పోతుందని రైతులు అంటున్నారు. గండ్లు పూడ్చాలని ఎన్నో దఫాలు విజ్ఞప్తి చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జక్కంపూడి గ్రామం వద్ద కూడా కాల్వలో ప్రవహించే నీరు రెండు కుండీల ద్వారా బుడమేరులో కలిసి వృథాగా పోతుందని ఆ ప్రాంతంలో కూడా కాల్వకు రిపేరు చేయాలని రైతులు కోరారు. కాల్వకు పడిన గండ్లు పూడ్చివేసి కాల్వలో దట్టంగా పెరిగిన గుర్రపుడెక్కను తొలగించాలని రైతులు కోరుతున్నారు.